


# నిర్ణయం

కొటూరు రవీంద్ర - త్రివిక్రమ్

నిశ్శబ్దం—

చీకటికీ నిశ్శబ్దానికీ గల అవినాభావ సంబంధం ఆ అర్ధరాత్రి యుద్ధరంగంలో ప్రస్ఫుటంగా తెలుస్తోంది.

'ట్రెంచెస్'లో నిలబడిన జవాన్లు, గురిచేసిన ఆయుధాలతో, తీక్షణమైన చూపుల్తో చీకటిని చీలుస్తున్నారు.

ఎక్కడా శత్రువుల్లో కదలిక లేదు!

రోజంతా ఎడతెరిపిలేకుండా కురిసిన గుళ్ల వానసాయంత్రానికల్లా ఆగిపోయింది.

నిజానికి ఆ రాత్రి భయంకరపోరాటం జరుగుతుందని అందరూ అప్రమత్తంగా ఉన్నారు. గాయపడినవాళ్ళనీ చనిపోయినవాళ్ళనీ మెడికల్‌కోర్ వాళ్ళు తీసుకెళ్ళిపోయేరు.

శత్రువుల సంఖ్య తాజాగా ఎంత ఉందో - ఉదయంనుండీ జరిగిన పోరాటంలో ఎందరు చనిపోయారో ఇంకా తెలియాల్సి ఉంది ఆ రాత్రికిడిఫెన్సివ్‌గా (స్వీయరక్షణతో) ఉండాలని జవాన్లకి కెప్టెన్ కుమార్ ఆదేశించాడు. అంటే_ అవకాశం ఉన్నా 'ఎడ్వాన్స్' కావటం 'రిస్క్' కావచ్చనిపించిం దతనికి. బహుశః ఉదయానికల్లా పరిస్థితి మరింత బాగా అర్థం కావచ్చును. 'అఫెన్స్' సంగతి అప్పుడే చూసుకోవచ్చు!

బంకరులో లాంతరు కాంతి మందంగా వ్యాపించి ఉంది.

కెప్టెన్ కుమార్ బల్లమీదున్న మ్యాప్ పరిశీలిస్తు, పెన్సిల్‌తో గుర్తులు పెట్టుకుంటున్నాడు.

అంతలో 'వైర్లెస్' మ్రోగింది_ రిసీవరు అందుకున్నాడు.

బ్రిగేడియర్ షరన్‌జీత్‌సింగ్! ఆప్యాయంగా అందర్నీ 'బేటా? అనే పిలవటం అలవాటు ఆయనకి.

"ఎలా ఉన్నావ్ బేటా?"

"బావున్నాను సాబ్."

"సరంజామా సరిపడా ఉందా?"

"రేపటిదాకా కాలక్షేపం చేయవచ్చు. రేపు కొందరు జవాన్లనీ, అమ్యునిషన్‌నీ పంపే ఏర్పాటుచేస్తే మంచిది...."

"ఏన్! ఉన్నవాళ్ళంతా ఉషారుగా ఉన్నారుగా? ఆహారపదార్థాల లోటు లేదుకదా?"

నవ్వేడు కుమార్.

"యుద్ధంలో ఆహారంకోసం ఎవరు తపిస్తారు సాబ్? జవాన్లు కోరేది విజయం! మిగతావి వాళ్ళని బాధించవ్"

"గుడ్! కీప్ ఇట్ అప్ .... గుడ్ నైట్ ...."

"గుడ్‌నైట్ ...."- రిసీవర్ పెడుతుండగా హవల్దార్ శ్యామ్ చెమటలు కక్కుతూ లోపలికొచ్చాడు. చంకకి సబ్‌మెషిన్‌గన్ తగిలించి ఉంది.

"బోలో శ్యామ్ ...." అన్నాడు మందహాసంతో కుమార్.

"సాబ్ ...." అంటూ నోరు పెగల నట్లు ఇబ్బందిపడ్డాడో క్షణం.

"చెప్పు ఫర్వాలేదు...." ప్రోత్సహించాడు.

"లెఫ్టినెంట్ సాబ్ ...."

"ఊఁ....ఏమైంది లెఫ్టినెంట్‌కి?"

"ఫారిన్ విస్కీ తాగుతున్నాడు సార్ ...."

ఉలిక్కిపడ్డాడు, కెప్టెన్ కుమార్.

"నువ్వు సరిగ్గా చూశావా?" సందేహంగా అడిగాడు.

"తమరు కూడా వచ్చిచూడండి సాబ్ ...."

"ఎక్కడున్నాడు లెఫ్టినెంట్ సాబ్?"

"మూడో బంకర్‌లో ...."

"సరే_నువ్వెళ్ళు ...."

శాల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

కుమార్ రివాల్వర్ నొకమాటు తడిమి చూసుకున్నాడు బైటికితీసి 'ఛాంబర్'ని పక్కకి జరిపి చూశాడు.

ఆరు తూటాలున్నాయి. 'పౌచ్'లోకి నెట్టి, బంకరు బయట కొచ్చాడు.

రెండవ బంకరులో మందుగుండు సామాగ్రి ఉంది.

మూడోదాంట్లో లెఫ్టినెంట్ భగత్ ఉన్నాడు!

నిశ్శబ్దంగా మెట్లుదిగి లోపలికి వెళ్ళేడు.

భగత్ అప్పటికే నిషా తలకెక్కి ఉన్నాడు. సీసా సగం ఖాళీగా ఉంది. దానిమీద అక్షరాలు చదివేడు. 'జానీ వాకర్....'

"అయియే కెప్టెన్ సాబ్! మీరూ కాస్త ఆనందం పంచుకోండి...." ఇంకో గ్లాసులోకి వంపుతూ ఆహ్వానించాడు

కుమార్ సీరియస్‌గా వెళ్ళి ఎదురుగా నిలబడ్డాడు.

అతనికి అందించాలనే ఉద్దేశ్యంతో గ్లాసు ఎత్తిపుచ్చుకున్నాడు భగత్.

కుమార్ చూపులు బల్లమీదున్న రివాల్వరుమీద పడ్డాయి.

చటుక్కున దాన్ని చేతిలోకి తీసుకుని లాగుజేబులో వేసుకున్నాడు.

భగత్ కంగారుగా చూస్తూ "అరే.... నా రివాల్వర్ ఎందుకు లాక్కున్నారు?" అన్నాడు.

"చెబుతాను! ముందు, సాయంత్రం నాలుగు-ఆరు గంటలమధ్య ఎక్కడికి వెళ్ళి ఏంచేశావో చెప్పు...."

నవ్వటానికి విఫలయత్నం చేస్తూ "మీకు సాయంత్రమే చెప్పాగా!!" అన్నాడు.

"ఆ చెప్పటంకాదు! ఈ జానీవాకర్ కథ కావాలి నాకు...." గంభీరంగా అన్నాడు.

"ఓ....యిదా! మా అంకుల్ స్టేట్స్‌లో ఉన్నారు. ఎప్పుడో ఆయన ఇచ్చింది నా దగ్గరుంటే టైమ్‌పాస్ చేస్తున్నాను. టేకిట్ ఈజీ కెప్టెన్ సాబ్. మీరు భయపడాల్సిందేమీలేదు. నేను సాయంత్రం అంతా సర్వేచేసి వచ్చాను. శత్రువుల్లో చాలామంది చచ్చిపోయిగానీ గాయపడిగానీ ఉండాలి. బహుశ విత్‌డ్రా అయ్యారని నా అనుమానం. మీరు వద్దన్నారుగానీ, మనం హాయిగా అడ్వాన్స్ అయ్యేవాళ్ళం!"

"నువ్వు సర్వేచేసి వచ్చావా, శత్రువులతో చేతులుకలిపి యీ జానీవాకర్ బహుమతి సంపాదించుకొచ్చావా?" తీవ్రంగా చూస్తూ గద్దించాడు.

"ఏమంటున్నారు మీరు!!"– ఏమీ అర్థంకానట్లు చూస్తూ ప్రశ్నించాడు.

అంతలో బయట పెద్ద వెలుగు– ప్రేలుళ్ళు – మెషీన్‌గన్‌ల శబ్దాలు చెలరేగాయి.

జవాన్ల కేకలు విన్పిస్తున్నాయ్....

హవల్దార్ శ్యామ్ గుమ్మందగ్గర నిలబడి "శత్రువులు బాగా దగ్గరికి వచ్చేశారు సార్. మన రెండో బంకర్ మీదకి గ్రెనేడ్లు విసురుతున్నారు,"అని అరుస్తూనే తూటాదెబ్బకి కూలిపోయాడు.

కెప్టెన్ కుమార్ వెంటనే రివాల్వర్‌తో గుమ్మంవైపుచూస్తు నిలబడ్డాడు. ఎవరో అనుమానంగా దిగటం గమనించి, ఆ ఆకారం కన్పించగానే చటుక్కున ట్రిగ్గర్ నొక్కాడు. ఒకటి-రెండు-కూలిపోయ్యాడు.

మరో రెండు నిముషాల్లో ఇంకొక శత్రుసైనికుడు.

రివాల్వరులో గుళ్ళు ఖాళీ అవుతున్నాయి.

గుమ్మం దగ్గర స్టెన్‌గన్ కాల్పులు.

రివాల్వరు జవాబులు.

'రీలోడ్' చేసే వ్యవధిలేదు.

రెండో రివాల్వరు బయటికి లాగాడు.

కాల్పులు—

ప్రతి కాల్పులు....

అయిదుగుళ్లు ఖాళీ....

మిగిలింది ఒకే ఒక్కటి!

అది వేస్ట్ చెయ్యకూడదు. ఆ తూటా గురి తప్పకూడదు. రివాల్వర్‌లో గుళ్ళు మళ్ళీ నింపేలోగా ఎవరైనా లోపలకి దూసుకువచ్చి తనని అంతం చెయ్యవచ్చుననే హెచ్చరికతో అలాగే గురిచేసుకుని గుమ్మంవైపు చూస్తూండిపోయేడు.

"ఇప్పటికయినా నా రివాల్వరు నాకిస్తే కనీసం ఆత్మరక్షణ చేసుకుంటాను." భగత్ ప్రాధేయపడుతూ అడిగేడు.

అంతలో గుమ్మందగ్గర ఓ గొంతు విన్పించింది.

"లెఫ్టినెంట్ భగత్! మేం నీ మిత్రులం. నేను కెప్టెన్ హుస్సేన్‌ని. ఎవరి దగ్గరన్నా ఆయుధాలుంటె కింద పడేయించు. మర్యాదగా మాకు లొంగిపొమ్మని చెప్పు. క్విక్. ఎదురుతిరిగితే షూట్ చేస్తాం...."

భరత్‌కేసి అసహ్యం నిండిన కళ్ళతో చూశాడు కుమార్.

అతని మొహంలోకి తేరి చూడలేక గుటకలు మింగుతూ మొహం చాటు చేసుకున్నాడు, భగత్.

"లెఫ్టినెంట్ భగత్! ఆన్సర్ మీ. లేకపోతే గ్రెనేడ్ విసురుతాం."

కెప్టెన్ కుమార్ విచికిత్సకి గురయ్యాడు.

రివాల్వరుకేసి ఓ మాటు చూసుకున్నాడు. అందులో ఒక్కటే తూటా ఉంది. తన గురి ఎట్టిపరిస్థితుల్లోనూ తప్పదు.

ఆ తూటాతో—

శత్రువుల చేతికి చిక్కి హింసలు పడకుండా ఆత్మహత్య చేసుకోవచ్చు. ప్రాణాలకు తెగించి శత్రువుల్లో ఒకణ్ణి మట్టుబెట్టవచ్చు. భగత్‌లాంటి దేశద్రోహిని తుదముట్టించవచ్చు.

ఏం చెయ్యాలి!!

"లాస్ట్ వార్నింగ్! లోపల ఉన్న వాళ్ళు ఆయుధాలు పడేసి లొంగకపోతే గ్రెనేడ్స్ విసురుతాం ఓన్లీ త్రీకౌంట్స్ వన్. టూ."

కెప్టెన్ కుమార్ చెయ్యి రివాల్వరు మీద గట్టిగా బిగుసుకుంది. ఆ బిగింపులో అతని నిర్ణయం ఉంది.

"త్రీ...."

గ్రెనెడ్, రివాల్వరు ఒకేసారి పేలాయి.

ఇద్దరూ నేలకొరిగేరు.

కానీ,

వాళ్ళలో ఒక్కరిదే వీరమరణం!

ఆ రహస్యం భగత్‌గుండెల్లో దూరి గర్వంగా నవ్వుకుంటున్న చివరి తూటాకే తెలుసు!

———